
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

కడప
జిల్లా వార్తలు
3
మంగళవారం 11 జూన్ 2024

అధికారం కోల్పోవడంతో..
వైసీపీ కార్పొరేటర్లు విలవిల



- బీజేపీలోకి వెళ్లేందుకు యత్నం
- ద్వారకానగర్‌లో 20 మంది కార్పొరేటర్లకు విందు రాజకీయం
- హిందూ కార్పొరేటర్లు హాజరు
- భూకబ్జాలు, అక్రమాలపై ఆరోపణలున్న కార్పొరేటర్లు..
- అధికార గొడుగు కిందకు వెళ్లే యత్నం

(కడప-ఆంధ్రజ్యోతి): ఎన్నికల ఫలితాలొచ్చి సరిగ్గా.. పదిరోజులు కూడా కాలేదు. చంద్రబాబునాయుడు నాలుగోసారి ముఖ్యమంత్రిగా ఇంకా పదవీ బాధ్యతలు చేపట్టలేదు. ప్రభుత్వం కొలువు దీరలేదు. ఐదేళ్ల అధికారాన్ని అడ్డగోలుగా ఉపయోగించుకుని అక్రమాలకు పాల్పడ్డ కొందరు వైసీపీ కార్పొరేటర్లలో ఆందోళన మొదలైంది. అధికారం లేకపోతే తమ సినిమా క్లోజ్ అవుతుందని డిసైడ్ అయినట్లున్నారు. పదిరోజులు తిరక్కముందే అధికారం కోల్పోయి నీటిలో నుంచి ఒడ్డునపడ్డ చేపపిల్లల్లా విలవిల్లాడిపోతున్నారు. దీనంతటికీ కారణం ఐదేళ్లపాలనలో తాము సాగించిన భూకబ్జాలు, దౌర్జన్యాలు, దాష్టీకాలన్నీ ఎక్కడ మెడకు చుట్టుకుంటాయోనన్న భయం కొందరిలో వేధిస్తోంది. అందుకే కూటమి పార్టీలోకి జంప్ అయ్యేందుకు సిద్ధమవుతుండడం గమనార్హం. ఆదివారం రాత్రి కడప నగరం ద్వారకానగర్‌లో వైసీపీకి చెందిన ఓ దేవస్థాన మాజీ బోర్డుమెంబరు నిర్వహించిన విందు రాజకీయానికి 20 మంది హిందూ కార్పొరేటర్లు హాజరు కావడంపై ఇప్పుడు వైసీపీలో పెద్ద టాక్ నడుస్తోంది. ఒకేసారి గంపగుత్తగా కార్పొరేటర్లు బీజేపీ గూటికి వెళ్లాలనే ఆలోచనలో ఉన్నట్లు చెబుతున్నారు. ఇప్పుడీ వ్యవహారం వైసీపీ పాలిటిక్స్‌లో దడ పుట్టిస్తోంది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి కడప జిల్లాలో వైసీపీ దారుణంగా దెబ్బతింది. ఏడు సీట్లు పోగొట్టుకుంది. సొంత జిల్లాలోనే ఫ్యాను రెక్కలు విరిచారు. ఆ ఓటమి నుంచి కోలుకోకముందే మళ్లీ 20 మంది కార్పొరేటర్లు కూటమి వైపు చూస్తుండడం తో జిల్లా రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

భూ అక్రమాల నుంచి బయటపడేందుకే..

ఐదేళ్ల జగన్ పాలనలో కొందరు కార్పొరేటర్లు ఇష్టారాజ్యంగా భూకబ్జాలు, దందాలు చేశారు. వాగులు, వంకలు చెరువుతట్టు భూములు, కేసీకెనాల్, బుగ్గవంక, తెలుగుగంగ ఆఫీసుకు సంబంధించిన భూములు.. ఇలా ఇష్టారాజ్యంగా కబ్జా చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారు. ముఖ్యంగా కార్పొరేషన్‌లో నెంబర్ 2గా చెలామణి అవుతున్న ఓ కార్పొరేటరు భారీ ఎత్తున భూకబ్జాలు చేశారనే ఆరోపణ ఉంది. ఆయన ఓ మాజీ ఎమ్మెల్యే అనుచరుడుగా ముద్ర పడ్డారు. ఆయన తీరుపై సొంత పార్టీలోనే విమర్శలున్నాయి. అయితే అధికార మార్పిడితో భూకబ్జాల వ్యవహారం వెలుగులోకి వచ్చి ఇబ్బందులు పడతామని భావించిన ఆయనతో పాటు మరికొందరు టీడీపీలోకి వెళ్లేందుకు ప్రయత్నాలు సాగించగా అక్కడ ఎమ్మెల్యే మాధవీరెడ్డి వద్దని చెప్పినట్లు సమాచారం. వైసీపీలో కబ్జాదారులుగా గుర్తింపు పొందిన కార్పొరేటర్లు టీడీపీలోకి వస్తే ప్రభుత్వానికి చాలా డ్యామేజీ అవుతుందంటూ తిరస్కరించినట్లు చెబుతారు.

టీడీపీ నో అనడంతో..

టీడీపీలోకి నో ఎంట్రీబోర్డు పడడంతో బీజేపీలోకి వెళ్లేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నట్లు చెబుతారు. ఇందులో భాగంగా కొందరు కార్పొరేటర్లు ఒకరికి ఒకరు ఫోన్లు చేసుకుని.. ఓ 20 మంది కలిసి బీజేపీలోకి వెళదాం, అక్కడ సముచిత స్థానం ఉండేలా అవకాశం కల్పిస్తారని ముందుగా మాట్లాడుకున్నట్లు సమాచారం. అయితే కొందరు మాత్రం పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు విడిచిపెట్టి వెళ్లడం భావ్యంకాదని చెప్పారంటారు. ఈ వ్యవహారంపై చర్చ నడుస్తుండగానే ఆదివారం రాత్రి ఓ మాజీ దేవస్థానం బోర్డు మెంబరు ద్వారకానగర్‌లో విందు ఇవ్వడం చర్చగా మారింది. ఎన్నికల ముందు ఇవ్వలేదు. ఎన్నికలయ్యాయి.. నా ఆత్మీయ కార్పొరేటర్లకు విందు ఇస్తున్నా అని ఆయన చెప్పుకొచ్చారంటారు. అయితే ఆయనకు ముస్లిం మైనార్టీ కార్పొరేటర్లే ముఖ్య అనుచరులుగా ఉన్నారు. అయినప్పటికీ మైనారిటీ వర్గానికి చెందిన ఏ ఒక్కరూ సమావేశానికి హాజరు కాకపోవడంపై చర్చ నడుస్తోంది. బీజేపీలో చేరేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు బీజేపీ పెద్దలకు సిగ్నల్ ఇచ్చారా అనేది అర్థంకావడంలేదు. తొలుత బీజేపీలోకి వెళదామని ఆఫర్ చేసిన కార్పొరేటరు కూడా విందుకు హాజరు కావడం గమనార్హం. హిందూ కార్పొరేటర్లను తీసుకుని బీజేపీలోకి వెళ్లేందుకు స్కెచ్ వేశారా అనేది చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం మారడంతో కడప నగరంలో భూకబ్జాలకు కళ్లెం పడతాదనే భావనతో అధికార గొడుగు కిందకు చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు అర్థమవుతోంది. భూకబ్జాలు, దందాలే వైసీపీ పతనానికి కారణమని ఆ పార్టీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. మళ్లీ కూటమిలోకి వస్తే కూటమికే చెడ్డపేరు వస్తుందని కొందరు అంటున్నారు. ఈసారి ఎవరైతే మాకేంటి అని చేర్చుకుంటారో, లేక వద్దంటారో వేచి చూడాలి.

జగన్ సమీక్ష

సార్వత్రిక ఎన్నికల్లో సొంత జిల్లాలో దారుణ పరాజయాన్ని జగన్ అండ్ కో జీర్ణించుకోలేపోతోందంటారు. ఉమ్మడి జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలను పోగొట్టుకుంది. చావు తప్పి కన్ను లొట్టపోయిన చందంగా వైసీపీ ఎంపీగా అవినాశ్‌రెడ్డి గట్టెక్కారు. దీంతో సొంత జిల్లాలో ఓటమిపై జగన్ త్వరలోనే సమీక్ష జరుపుతారని చెబుతున్నారు. పార్టీ ఓటమికి గల అంశాలు, పార్టీ పటిష్టతలపై తీసుకోవాల్సిన చర్యలపై త్వరలోనే సమీక్ష సమావేశం నిర్వహిస్తారని వైసీపీ వర్గాలు వెల్లడించాయి.

డిప్యూటీ మేయర్ డివిజన్‌లో దాహం.. దాహం

- ప్రజల పక్షాన కార్పొరేషన్ ఎదుట టీడీపీ ఆందోళన
- డిప్యూటీ కమిషనర్‌కు వినతి పత్రం.. సమస్యలపై ఏకరువు
- పరిష్కరిస్తామని డిప్యూటీ కమిషనర్ హామీ

కడప(రూరల్) జూన్ 10 : కడప కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న 18వ డివిజన్‌లో ఏడాది నుంచి ప్రజలు దాహంతో అలమటిస్తున్నారు. పలుమార్లు డిప్యూటీ మేయర్‌కు, కార్పొరేషన్ అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకపోవడంతో సోమవారం టీడీపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ప్రజలు కడప కార్పొరేషన్ ఎదుట అందోళన చేపట్టారు. ఈ ఆందోళనకు సీపీఐ మద్దతుగా పాల్గొన్నారు. దాదాపు గంటకు పైగా కార్యలయం ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా టీడీపీ కడప కార్పొరేషన్ క్లస్టర్ ఇన్‌చార్జ్ గంధం మోహన్‌బాబు, టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ పొన్నాలు సుబ్బిరెడ్డి, సీపీఐ నాయకులు వేణు గోపాల్, కేసీ బాదుల్లా మాట్లాడుతూ డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న 18వ డివిజన్‌లోని సాయిప్రతాప్‌నగర్, జేపీ నగర్, ఎస్సార్ నగర్, స్వామి నగర్ తదితర ప్రాంతాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రజాసమస్యలను పట్టించుకోకుండా గాలికి వదిలేశారన్నారు. 10 ఏళ్ల నుంచి కడప కార్పొరేషన్ పాలకమండలి వైసీపీ చేతుల్లో ఉన్నప్పటికీ విలీన గ్రామాల్లో ప్రజలకు అవసరమైన తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ వంటి కనీస మౌలిక సదుపాయాలను కల్పించకపోవడం దారుణమన్నారు. సాయిప్రతాప్ నగర్ కాలనీ ఏర్పడి 20 సంవత్సరాలు పైబడిందని కటిక పేదలు నివసిస్తున్న ఈ కాలనీలో ఏడాదిగా తీవ్ర నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారన్నారు. వారంరోజులకు ఒకసారి కూడా మంచినీరు అందడం లేదన్నారు. ఈ ప్రాంతానికి ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలోని స్వామినగర్‌లో ఉన్న బోరుబావి నుంచి సరఫరా అవుతుందన్నారు. సాయిప్రతాప్ నగర్ ఎత్తు భాగంలో ఉండడం వలన నీరు సక్రమంగా సరఫరా కావడం లేదన్నారు. వారానికి ఒక గంట సమయం మాత్రమే ఆరకొరగా వచ్చే నీరు కూడా లీకేజీల కారణంగా వృధాగా పోతోందన్నారు. అయితే స్థానిక కార్పొరేటర్ కొత్తగా ఏర్పాటుచేసిన వెంచర్లకు మాత్రం అక్కడ నివాసం లేకపోయినా మంచినీటి పైపులైన్ ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు సాయిప్రతాప్ నగర్ ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యకు తక్షణ పరిష్కారం చూపేలా కాలనీలో బోరుబావిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ రాకేశ్‌చంద్రను కలిసి వినతిపత్రం అందజేసి సమస్యలను ఏకరువు పెట్టారు. దీనిపై డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ నీటి సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రస్తుతం ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎం.అక్బర్‌బాషా, చంద్రారెడ్డి, సుబ్బారెడ్డి, ఆదినారాయణరెడ్డి, లక్ష్మీనారాయణ, నాగేశ్వర్‌రెడ్డి, సిరాజ్‌బాషా, వసంతరెడ్డి, రహమాన్ తదితరులు పాల్గొన్నారు.


కడప కార్పొరేషన్ కార్యాలయం ఎదుట టీడీపీ ఆధ్వర్యంలో అందోళన చేస్తున్న సాయిప్రతాప్ నగర్ ప్రజలు

ముగ్గురాయి దొంగలు

- విజిలెన్స్ నివేదికను తొక్కిపెట్టిన వైనం
- అవినీతి అధికారులపై తాత్కాలిక వేటు
- కీలక రికార్డులు మాయం చేసేందుకు యత్నాలు

గనుల్లో అక్రమాలకు తావు లేకుండా చేయాలి..



ఏపీఎండీసీ మంగంపేట గనుల్లో అక్రమాలకు తావులేకుండా చేయాలి. లాభాలను చేకూర్చే మైనింగ్‌ను ప్రభుత్వాలు గట్టి చర్యలు తీసుకోవాలి. ఏపీఎండీసీలో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, జీతాలు పెంచాలని, సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని యాజమాన్యంతో పోరాటాలు చేస్తున్నా పట్టించుకోలేదు. మైనింగ్‌లో అక్రమాలు చేస్తూ సంస్థకు లాభాలు చేకూర్చిన కార్మికుల సమస్యలు మాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా కొత్త ప్రభుత్వం మైనింగ్‌లో అక్రమాలు జరగకుండా చేస్తూ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి.

- తుమ్మల రాధాక్రిష్ణయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు, రైల్వేకోడూరు

అక్రమ సంపాదనతో వైభవంగా పెళ్లిళ్లు..

మైనింగ్‌లో అక్రమంగా సంపాదించిన డబ్బుతో ఏపీఎండీసీ ఎండీగా ఉండిన వ్యక్తి వారి ఇంట్లో పూర్వకాలంలో రాజులు కూడా చేసుకోని విధంగా వివాహాలను జరిపించారు. మంగంపేట ఏపీఎండీసీలో నిజాయితీగా పనిచేసిన వారిని ఇతర రాష్ట్రాలకు బదిలీ చేయించారు. మంగంపేట ముగ్గురాళ్ల దొంగల పని పట్టాలి. విజిలెన్స్ నివేదిక, రికార్డులు భద్రపరచడంతో పాటు అసలు నిందితులను కఠిన చర్యలు తీసుకోవాలి.

- సీహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు, వర్కర్స్ యూనియన్



రైల్వేకోడూరు, జూన్ 10: మంగంపేట బెరైటీస్‌లో ముగ్గురాయి దొంగలు కొన్ని టన్నుల ఏ-గ్రేడు ముగ్గురాయిని అక్రమంగా తరలించారు. దీనిపై విజిలెన్స్ అధికారులు విచారణ చేసినా ఆ నివేదికను కొందరు అధికారులు తొక్కిపెట్టి అవినీతికి పాల్పడిన అధికారులపై తాత్కాలికంగా వేటు వేసి తర్వాత విధుల్లోకి తీసుకుని ఇతర రాష్ట్రానికి బదిలీ చేశారు. కీలకమైన రికార్డులను మాయం చేసేందుకు ప్రస్తుతం ప్రయత్నాలు జరుగుతున్నాయని మంగంపేటవాసులు అంటున్నారు. ఏడాది క్రితం మంగంపేట ఏపీఎండీసీ ముగ్గురాయి డంపింగ్ యార్డులో అవినీతి అధికారులు, సిబ్బంది, అధికార పార్టీ నాయకుల సహకారంతో సుమారు 1000 లారీల్లో ఏ-గ్రేడు ముగ్గురాయిని ఒక కంపెనీకి తరలించారు. ఈ సంఘటనపై అప్పట్లో రాష్ట్రంలో కలకలం రేగింది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మంగంపేటలో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయని పలు యూనియన్లు ఆందోళనలు చేశాయి. ముగ్గురాళ్ల గనుల్లో ఏ-గ్రేడును బీ-గ్రేడుగా, బీ-గ్రేడును సీ-గ్రేడుగా మార్చేశారనే ఆరోపణలు వినిపించాయి. ఏడాది క్రితం ఒకేరోజు రాత్రి కొన్ని వందల టన్నుల రాయిని డంప్ నుంచి అక్రమంగా తరలించారనే సంఘటనపై మంగంపేటలో కలకలం రేగింది. మంగంపేటకు చెందిన గత ప్రభుత్వ నాయకుల సహకారంతో ఒక కంపెనీకి 920 ట్రిప్పుల రాయిని అక్రమంగా తరలించారనే అభియోగం వచ్చింది. దీనిపై విజిలెన్స్ విచారణకు వైసీపీ ప్రభుత్వం ఆదేశించింది. ఏపీఎండీసీలో ప నిచేస్తున్న ఒక అధికారి చేత విచారణ చేయించారు. అయితే ఆ అధికారి కేవలం 25టన్నుల రాయి మాత్రమే తరలిపోయిందని చేతులు దులుపుకున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అయితే విజిలెన్స్ అధికారులు విచారించి నివేదికను విజయవాడ కార్యాల యానికి పంపినట్లు కార్మిక సంఘాలు చెబుతున్నాయి. విజిలెన్సు నివేదికలో ఏముంది, అసలు మైనింగ్‌లో అక్రమాలకు పాల్పడింది ఎవరు అనేది ఉంటుంది. ఈ నివేదికను ఎందుకు తొక్కి పెట్టారని కార్మిక సంఘాల వాదన. మంగంపేట ముగ్గురాళ్ల సంస్థ కార్యాలయంలో పనిచేసే సీపీవో, పలువురు సిబ్బందిపై వేటు పడింది. అయితే గతంలో పనిచే సిన సీపీవో సస్పెన్షన్‌ను తొలగించి ఇతర రాష్ట్రానికి బదిలీ చేశారు. డంపింగ్ యార్డు వద్ద ఉన్న పలువురిని కూడా సస్పెం డు చేశారు. అయితే ఇందులో కొం దరికి ప్రమేయం లేదని స్పష్టంగా తెలియడంతో తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకున్నారు. అసలు ముగ్గురాళ్లను దొంగతనం చేయాల్సినంత అవసరం ఎందుకు వచ్చింది, ఒక కంపెనీకి ఎందుకు అక్రమంగా రాత్రివేళలో 920 లారీల్లో 6 వేల టన్నుల ఏ-గ్రేడు రాయిని తరలించారన్నది తెలియాల్సి ఉంది. ఏ-గ్రేడు రాయి టన్ను రూ.8309, బీ-గ్రేడు టన్ను రూ.6438, సీ, డీ గ్రేడు రాయి టన్ను రూ. 2120 ధర పలుకుతోంది. ఒక ప్రైవేటు కంపెనీకి ఎందుకు లాభాన్ని చేకూర్చాలని అనుకున్నారు అనేది అంతుపట్టని విషయంగా మారింది. కేవలం రెండు లారీల్లో మాత్రమే ముగ్గురాయిని తరలించారని, దానిని రికవరీ చేశామని గతంలో అధికారులు చెప్పుకొచ్చారు. అక్రమంగా రాయి తరలిపోయేందుకు ఏపీఎండీసీ విజయవాడ నుంచి ప్రధాన సూత్రదారి చక్రం తిప్పారని కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. సూత్రధారులు ఎవరనేది తెలిసినా కేవలం తా త్కాలిక వేటుతోనే సరి పెట్టారు. మంగంపేట ఏపీఎండీసీ కా ర్యాలయంలో నిజాయితీగా పని చేసిన సీపీవోను ఇతర రాష్ట్రానికి అక్రమంగా బదిలీ చేయించారని కార్మికులు అంటున్నారు. ఇదిలా ఉంటే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 350 మందికి ఉద్యోగాలు ఇచ్చారు. ఎన్నికల కోడ్ ఉండగానే పాత తేదీలు వేసి 25 మందికి ఉద్యోగాలు ఇచ్చారని స్థానికులు చెబుతున్నారు. ఏపీఎండీసీ ద్వారా ఇసుక, ముగ్గురాళ్లు తదితరాలను అక్రమంగా తరలించుకుని వైసీపీ నాయకులు కోట్లు సంపాదించుకున్నారని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. తెలంగాణా నుంచి ఏపీఎండీసీకి రూ.990 కోట్లు రావాల్సి ఉండగా దానిని ప్రభుత్వానికి జమ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. మంగంపేట ముగ్గురాళ్ల గనుల ద్వారా వచ్చిన ఆదాయం రూ.4450 కోట్లను వైసీపీ ప్రభుత్వం వాడుకుందని కార్మిక నాయకులు చెబుతున్నారు. ఇప్పటికే విజయవాడలోని ఏపీఎండీసీ ప్రధాన కార్యాలయంలో కీలక పత్రాలు మాయం చేస్తున్నారని సమాచారం రావడంతో కొత్త ప్రభుత్వం ఆ కార్యాలయానికి తాళాలు వేసిన సంగతి తెలిసిందే. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలన పూర్తవుతున్న తరుణంలో కోటి టన్నుల ముగ్గురాళ్లకు ఆఘమేఘాల మీద టెండర్‌ను పిలిచారు. వైసీపీకి చెందిన కొన్ని కంపెనీలకు మేలు చేయాలని తలంచింది. దీనిని గమనించిన పలు కార్మిక సంఘాలు, మంగంపేట స్థానికులు, టీడీపీ నాయకులు దానిని అడ్డుకున్నారు. విజిలెన్స్ నివేదికలో లోపాలు ఉంటే సీఐడీకి అక్రమాల చిట్టాను అప్పగించాలని, విజిలెన్సు నివేదికను కాపాడాలని, జరిగిన అక్రమాలపై నిజానిజాలు బయటకు తీయాలని, అక్రమార్కులపై వేటు వేయాలని కార్మిక సంఘాలు, స్థానికులు, టీడీపీ నాయకులు కోరుతున్నారు.

ఏపీఎండీసీ సీపీవో ఏమన్నారంటే..

ఏపీఎండీసీ మంగంపేట ముగ్గురాళ్ల గనుల్లో జరిగిన అక్రమాలపై ఇంకా విచారణ జరుగుతోందని సీపీవో సుదర్శన్‌రెడ్డి తెలిపారు. మంగంపేట ప్రధాన కార్యాలయంలో ఉన్న రికార్డులు ఎక్కడికీ పోలేదని భద్రంగానే ఉన్నాయని తెలిపారు. ముగ్గురాళ్ల గనుల్లో సక్రమంగా పనులు జరుగుతున్నాయని వివరించారు. ఏ ఫైలు బయటకు పోకుండా జాగ్రత్తగా పెట్టి ఉన్నామని తెలిపారు.

అజ్ఞాతంలో వైసీపీ నేతలు



- క్యాడర్ ఫోన్లు చేసినా ఎత్తని వైనం
- అయోమయంలో కార్యకర్తలు
- కొందరు గోవాలో, మరికొందరు దేశాలే వదిలిపెట్టిన వైనం
- చాలామంది ఇతర రాష్ట్రాల్లో మకాం
- ప్రభుత్వం పోయినా పదవీ వ్యామోహంలో కొందరు

రైల్వేకోడూరు, జూన్ 10: అందరూ ఊహించిన విధంగా రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చింది. వైసీపీకి కోలుకోలేని స్థితి ఏర్పడింది. రాష్ట్రంలో కేవలం 11 స్థానాలు మాత్రమే వచ్చాయి. దీంతో వైసీపీ క్యాడర్ మొత్తం కనిపించని స్థితికి వచ్చింది. రైల్వేకోడూరులో ఐదోసారి పోటీ చేసిన వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొరముట్ల శ్రీనివాసులు ఓటమి పాలు కావడంతో నాయకత్వ బాధ్యతలు తీసుకున్న వారు ఈనెల 5వ తేదీ నుంచి ఫోన్లు చేసినా ఎత్తడం లేదని కార్యకర్తలు అయోమయంలో పడ్డారు. కొందరు నేతలు విదేశాల్లో ఉండగా మరికొందరు ఇతర రాష్ట్రాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. వారు ఇంతవరకు తమకు అందుబాటులోకి రాలేదని పలువురు కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు అవినీతి పనులు చేశారని అందువల్ల ఎక్కడ పట్టుకుంటారో అని భయాందోళనతో గోవా తదితర ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల బెంగళూరు, హైదరాబాద్ తదితర నగరాల్లో చాలామంది వైసీపీ నేతలు తారసపడ్డా ముఖం చాటేశారని చెప్పుకుంటున్నారు. ఇక్కడ 20 ఏళ్లు ఒకరే అధికారంలో ఉండగా చేసిన పనుల వల్ల ఇప్పుడు తమ బండారం ఎక్కడ బయటపడుతుందోనన్న భయాందోళనతో ఈనెల 5 నుంచి కనిపించకుండా వెళ్లారనేది కోడూరులో ప్రధానంగా చర్చ సాగుతోంది. వైసీపీకి చెందిన కొందరు నేతలకు నామినేటెడ్ పదవులు ఉన్నాయి. వాటికి ఇంకా రాజీనామాలు చేయకుండా పదవీ వ్యామోహంతో ఇక్కడ కనిపించకుండా తిరుగుతున్నారని అందరూ చర్చించుకుంటున్నారు. పంచాయతీ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు అవినీతిలో భాగస్వామ్యం అయిన వారు పూర్తిగా కనిపించకుండా పోయారని వైసీపీ కార్యకర్తల్లో చర్చ నడుస్తోంది. కనీసం వైసీపీ కార్యాలయం వైపు కూడా నేతలు రాకుండా ఉన్నారంటే క్యాడర్ పూర్తిగా చిన్నాభిన్నం అయిందని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు.

రాజీనామాపై డీసీసీబీ చైర్‌పర్సన్ మడత పేచీ

- చీఫ్ సెక్రటరీ ఆదేశాలు తమకు వర్తించవట..!
- ఆప్కాబ్‌కు జీవో రావాలంటూ కాలయాపన
- ఇతర జిల్లాల్లో చైర్మన్ల రాజీనామా


డీసీసీబీ చైర్‌పర్సన్ చాంబర్ ఎదుట ఝాన్సీరాణి పేరుతో ఉన్న నేమ్ ప్లేట్

కడప(రూరల్), జూన్ 10: రాష్ట్రంలో వైసీపీ చిత్తుచిత్తుగా ఓడిపోయింది. ఎన్డీయే కూటమి అఖండ మెజార్టీతో గెలుపొందింది. దీంతో ఎన్డీయే కూటమి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు బుధవారం ప్రమాణస్వీకారం చేసి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయనున్నారు. ఈ కార్యక్రమానికి ముందుగానే గత ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి స్థానంలో నీరబ్ కుమార్ ప్రసాద్‌ను నియమించారు. ఆయన బాధ్యతలు చేపట్టిన తదనంతరం.. ప్రభుత్వ, ప్రభుత్వేతర అనుబంధ సంస్థలకు గత వైసీపీ ప్రభుత్వం కట్టబెట్టిన నామినేటెడ్ పదవులకు రాజీనామా చేయాలని ఆదేశించారు. ఈ మేరకు ఇతర జిల్లాల్లోని కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ల పదవులకు రాజీనామాలు చేస్తున్నారు. అయితే మాజీ సీఎం జగన్ సొంత జిల్లాలోని కడప కేంద్ర సహకార బ్యాంకు చైర్‌పర్సన్‌గా ఉంటున్న మల్లెల ఝాన్సీరాణి మాత్రం ఇప్పటి వరకు రాజీనామా చేయలేదు. తాను అటు ఆప్కాబ్‌కు ఇటు డీసీసీబీకి చైర్‌పర్సన్‌గా ఉన్నానని ఈ నేపథ్యంలో ఆప్కాబ్‌కు మొదటగా రాజీనామా చేసిన తరువాతనే డీసీసీబీ చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేయాలన్నారు. కానీ ఇంతవరకు ఆప్కాబ్ చైర్‌పర్సన్ పదవి రాజీనామా చేయాలంటూ జీవో రాలేదని అందుకే కొనసాగుతున్నట్లు ఆమె చెప్పుకొస్తున్నారు. ఈ వ్యవహారంపై ఆంధ్రజ్యోతి ఝాన్సీరాణీని వివరణ కోరగా.. ఆప్కాబ్‌కు జీవో వచ్చిన తరువాతనే రాజీనామా చేయాల్సి ఉందని ఆ తరువాతనే డీసీసీబీ పదవికి రాజీనామా ఉంటుందని తెలిపారు. అంతవరకు డీసీసీబీ చైర్‌పర్సన్‌గా కొనసాగుతానని స్పష్టం చేశారు.



ఫైళ్లపై చకచకా సంతకాలు?

డీసీసీబీ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి సోమవారం కడప డీసీసీబీ కార్యాలయానికి వచ్చినట్లు అక్కడి అధికారులు పేర్కొంటున్నారు. అనుకూలమైన ఫైళ్లపై పాత తేదీలు వేసి చకచకా సంతకాలు చేసినట్లు సమాచారం. గత వైసీపీ ప్రభుత్వానికి అంటిపెట్టుకొని ఉండి అడుగులకు మడుగులు వత్తిన వారికి మేళ్లు, ప్రయోజనాలు కల్పిస్తూ ఫైళ్లపై పాత తేదీలు వేసి సంతకాలు చేసి కదిలించినట్లు సమాచారం. డీసీసీబీలో పనిచేస్తున్న పలువురు అధికారులు, ఉద్యోగులు వైసీపీ సానుభూతి పరులు కావడంతో ఈ వ్యవహారాన్ని దగ్గరండి నడిపించి బయటికి పొక్కనీయకుండా ఉంచినట్లు తెలిసింది.

పూర్తయ్యేదెన్నడు!

● అసంపూర్తిగా అదనపు తరగతి గదుల నిర్మాణం ● 13న ప్రారంభం కానున్న పాఠశాలలు

పోరుమామిళ్ల, జూన్ 10 : గత ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో మౌలిక వసతులు, అదనపు తరగతి గదుల కోసం నిధులు కేటాయించి దాదాపు రెండు సంవత్సరాలకు పైగా అవుతోంది. విడతల వారీగా నిధులు కేటాయించడం, సాంకేతిక సమస్యల కారణంగా పూర్తి స్థాయిలో నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో 13న పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు పూర్తి స్థాయిలో సౌకర్యాలు అందుతాయా లేదా అన్నది ప్రధాన సమస్యగా మారింది. గతంలో మండలానికి సంబంధించి నాడు నేడు పథకం కింద 38 పాఠశాలల



పైకప్పు స్థాయిలో నిలచిపోయిన పాఠశాల భవన నిర్మాణం

భవనాలకు మరమ్మతులకు మరో 10 అదనపు భవన నిర్మాణాలకు మొత్తం 14 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఇందుకు సంబంధించి విద్యాకమిటీ ఛైర్మన్లను ఆ పాఠశాల ప్రధానోపా ధ్యాయులను భాగస్వామ్యం చేసింది. కానీ విడతల వారీగా బిల్లులు చెల్లించడంతో ఇప్పటికీ కూడా పూర్తిస్థాయిలో తరగతి గదులు నిర్మాణా నికి నోచుకోలేదు. పోరుమామిళ్లకు సంబంధించి జిల్లా పరిషత్ హైస్కూలు, ఉర్దూ మెయిన్ స్కూలు కాపువీధి, 15వ వార్డు అంగన్వాడీ కేంద్రాలకు నిధులు మంజూరయ్యాయి. కానీ జిల్లా పరిషత్ హైస్కూలుకు సంబంధించి ఇంకా పూర్తి కావాల్సిన పనులే ఉన్నాయి. రంగసముద్రం పంచాయతీలో కమ్మవారిపల్లె, కమ్మవారిపల్లె ఎస్టీ కాలనీ, గిరినగర్ ఎస్టీ కాలనీకి మరమ్మతులు మాత్రం పూర్తయ్యాయి. కస్తూర్బా జూనియర్ బాలికల కళాశాలకు సంబంధించి రెండు అదనపు తరగతి గదులకు స్లాబులు వేయాల్సి ఉంది. దమ్మనపల్లె పంచాయతీలోని ఈదుళ్లపల్లె లో మరమ్మతులు చేశారు. కొరపాటిపల్లె పంచాయతీకి సంబంధించి ఇందిరానగర్‌లో కిచెన్‌షెడ్డు పెండింగులో ఉంది. వెంకటాపురం జిల్లా పరిషత్ హైస్కూలుకు సంబంధించి రెండు అదనపు తరగతి గదులుకు నిధులు మంజూరు కాగా, ఒకటి ప్రారంభానికి నోచుకోలేదు. మరొకటి గ్రౌండ్ లెవల్‌లోనే మిగిలిపోయింది. కవలకుంట్ల ఎస్సీ కాలనీలో కిచెన్‌షెడ్డు పెండింగులో ఉంది. టేకూరుపేట జిల్లాపరిషత్ హైస్కూలులో అదనపు తరగతి గదులకు సుమారు కోటి నిధులు మంజూరైనా పనులు మాత్రం గ్రౌండ్ లెవెల్‌లో ఉండిపోయాయి. సిద్దవరం జిల్లా పరిషత్‌లో అదనపు తరగతి గదికి సంబంధించి ఫెన్సింగ్ వర్క్ జరగాల్సి ఉంది.గానుగపెంట జిల్లా పరిషత్ హైస్కూలుకు మరమ్మతులు పూర్తయ్యాయి కానీ వీటికి మూడు అదనపు తరగతి గదులకు 40 లక్షలు నిధులు మంజూరైనా అది ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. మొత్తం 38 స్కూళ్ల మరమ్మతులు సంబంధించి దాదాపు 85 శాతం పూర్తయింది. సిద్దవరం గ్రామంలో స్కూలుకు స్లాబు వేయాల్సి ఉంది. మరమ్మతులు అయితే దాదాపు పూర్తి కావస్తున్నా అదనపు తరగతి గదులు నిర్మాణం మాత్రం నిర్మాణానికి నోచుకోక అలాగే ఉండిపోయాయి. మరి ఇవి ఎప్పుడు నిర్మాణానికి నోచుకుంటాయో ఎప్పుడు పూర్తవుతాయో విద్యార్థులకు పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తారో వేచి చూడాల్సిందే. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఓబయ్యను వివరణ కోరగా, పోరుమామిళ్ల మండలానికి సంబంధించి మరో పాఠశాల మరమ్మతులు దాదాపు 90 శాతం పూర్తయ్యాయన్నారు. ఫర్నీచర్స్ కూడా వచ్చాయని, 9 అదనపు తరగతి గదుల నిర్మాణం పెండింగులో ఉందన్నారు. ఇంకా ఇప్పటి వరకు జరిగిన పనులకు 58 లక్షలు గ్రాంటు ఉందని, ఆ పనులు కూడా త్వరగా పూర్తిచేస్తామన్నారు.



పోరుమామిళ్ల జిల్లా పరిషత్ హైస్కూలులో అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనం

వేంపల్లె - రాయచోటి రోడ్డును పూర్తి చేయండి

వేంపల్లె, జూన్ 10 : పెండింగులో ఉన్న వేంపల్లె - రాయచోటి రోడ్డును ఈ ప్రభుత్వమైనా పూర్తి చేయాలని పీసీసీ రాష్ట్ర మీడియా ఛైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. వేంపల్లెలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేంపల్లె నుంచి రాయచోటి వరకు గతంలో రోడ్డు పనులు చేస్తూ నిలిపివేశారని దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రోడ్డు పనులు ముందుకు సాగలేదని వేంపల్లె నుంచి రాయచోటికి రెండు గంటలు సమయం పడుతుందన్నారు. ఆ దారిలో ప్రయాణం చేయడం వల్ల వాహనాలు దెబ్బతింటున్నాయని అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేస్తామని చెబుతున్న టీడీపీ ప్రభుత్వం వెంటనే పనులు చేపట్టి పూర్తి చేయాలని కోరారు.

పద్మభూషణ్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

కడప (నాగరాజుపేట), జూన్ 10 : 2025 సంవత్సరానికి గాను పద్మభూషణ్, పద్మవిభూషణ్ మరియు పద్మశ్రీ అవార్డుల కోసం సామాజిక సేవా సంస్థల నుంచి అర్హులైనఅభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కడప స్టెప్ ముఖ్యకార్యనిర్వహణాధికారి సాయిగ్రేస్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను హెచ్‌టీటీపీ//అవార్డ్స్‌గొ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని ఆమె కోరారు. దరఖాస్తు చేసిన కాపీలను జూలై 15 లోపు పోస్టు ద్వారా కానీ, నేరుగా కానీ కడప స్టెప్ కార్యాలయానికి చేర్చవలసిందిగా ఆమె తెలిపారు. ఇతర వివరాలకు 9949298810, 9849497045లను సంప్రదించాలని కోరారు.

గంగమ్మ గుడి హుండీ ఆదాయం రూ.1.94 లక్షలు

సీకేదిన్నె, జూన్ 10: చింతకొమ్మదిన్నె మండలం కొత్తపేట గంగమ్మగుడికి హుండీ ద్వారా రూ.1,94,097 ఆదా యం వచ్చినట్లు ఈవో సురేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గంగమ్మ ఆలయంలో అధికారులు, భక్తుల సమక్షంలో సోమవారం హుండీలను తెరచి లెక్కించగా వచ్చిన మొత్తాన్ని దేవస్థానం పేరుతో బ్యాంకులో జమ చేస్తామ న్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ జనార్దన్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మోటారు వాహనాలకు థర్డ్ పార్టీ బీమా తప్పనిసరి

సికెదిన్నె, జూన్ 10: మోటారు వాహనాలకు థర్డ్ పార్టీ బీమా తప్పనిసరిగా తీసుకోవాలని రవాణా శాఖ ఉపకమిషనర్ మీరాప్రసాద్ సూచించారు. 2030 నాటికి రోడ్డు ప్రమాద మరణాలను 50 శాతం తగ్గించాలని నిబద్ధతతో భారత ప్రభుత్వం రహదారి భద్రతపై ప్రత్యేక దృష్టిసారించడంతోపాటు, తగిన చర్యలు చేపడుతోందన్నారు. మోటారు వాహనాల చట్టం 1988 సెక్షన్ 146 ప్రకారం చెల్లుబాటు అయ్యే బీమా లేకుండా ఎటువంటి మోటారు వాహనాలను ఉపయోగించకూడదని భారత ప్రభుత్వం తెలియజేసిందన్నారు. అదే విధంగా 1985 మోటారు వాహనాల చట్టం సెక్షన్ 196 ప్రకారం బీమా లేని వాహనాలను నడిపినందుకు చట్టప్రకారం శిక్షలు విధిస్తామన్నారు. మొదటి నేరం కింద మూడు నెలలు జైలు శిక్ష, లేదా రూ.2 వేలు జరిమానా, రెండూ కూడా విధించవచ్చన్నారు. రెండవ సారి అదే నేరం చేస్తే మూడు నెలల వరకు జైలు శిక్ష, రూ.4 వేల జరిమానా లేదా రెండు కూడా విధించే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించారు. కడపజిల్లాలోని వాహనదారులు 2024 ఏప్రిల్ నుంచి థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని, అలా లేకుండా ఇష్టం వచ్చినట్లు వాహనాలు తిప్పితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు రవాణాశాఖ అధికారులకు సహకరించాలని ఉపకమిషనర్ తెలిపారు.

అంగళ్లులో ఒంటె అపహరణ

కురబలకోట, జూన్ 10: బక్రీద్ పండుగ సందర్భంగా ఖుర్బానీ కోసం తెచ్చిన ఒంటె అపహరణకు గురైన సం ఘటన మండలంలో జరిగింది. బాధితుల కథనం మేరకు మండలంలోని అంగళ్లు పంచాయతీ పోరెడ్డివారి పల్లెకు చెందిన ఏడుగురు కలసి బక్రీద్ పండుగ సందర్భంగా ఖుర్బానీ ఇవ్వడానికి 15 రోజుల క్రితం ఒంటెను కొనుగోలు చేసి ఇంటి ముందు కట్టేశారు. సోమవారం తెల్లవారే సరికి ఒంటె కనిపించకపోవడంతో ఆందోళనకు గురై చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఒంటెను శనివారం అర్ధరాత్రి దుండగులు అపహ రించారు. కాగా, కొనుగోలుదారులు చుట్టుపక్కల వెతికినా ఆచూకి దక్కకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో పోలీసులు పట్టణంలోని పలుచోట్ల ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా, ముగ్గురు వ్యక్తులు ఒంటె ను స్కూటర్‌కు కట్టుకుని మదనపల్లె వైపు తీసు కెళ్ళి న దృశ్యాలు కనిపించాయి. కాగా ఒంటె ఆచూకీ అందించిన వారికి రూ.20వేలు పారితోషకం అందిస్తామని బాధితులు తెలిపారు.

పక్కాగా ఇసుక అక్రమ రవాణా..

● ఇష్టానుసారంగా తరలింపు
● అడ్డుకునే వారెవరంటూ దబాయింపు

చెన్నూరు, జూన్ 10 : చెన్నూరు - కొండపేట మధ్య పెన్నానది నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. స్థానిక పోలీసుస్టేషన్‌కు ముడుపులు అందుతున్నాయని, అందుకే.. అక్రమ రవాణా జోరందుకుందని విమర్శలు ఉన్నాయి. మూడురోజుల క్రితం పెన్నాకు వరద నీరు వచ్చినా, చీకటి పడగానే కొండపేట వైపు నుంచి దాదాపు 20 ట్రాక్టర్లు ఇసుక కోసం నదిలో దిగుతున్నాయి. ఈ ట్రాక్టర్లు పోలీసుస్టేషన్ ముందునుంచే వెళుతున్నా పోలీసులు కానీ, రెవెన్యూ కానీ ఏమీ పట్టించుకోకుండా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి ఇసుక అక్రమ రవాణాకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. పోటీలు పడి కడప నగరానికి ఇసుక తరలిస్తున్నారు. ఒక్కో ట్రిప్పుకు 3 వేల నుంచి 4వేల వరకు ధర పలుకుతుండడంతో మంచి ఆదాయమార్గంగా మారింది. పైగా ఒకరికొకరు సమాచారం అందించుకుంటూ పార్టీలకతీతంగా ఇసుక తరలిస్తున్నారు. ముఖ్యంగా వైసీపీలో ఉన్న వారే ఇసుక అక్రమరవాణాకు బీజం వేశారు. ఇసుక తరలింపులో అందరూ ఒక ప్రణాళిక ప్రకారం వ్యవహరిస్తున్నారు. పొద్దుగూకగానే ఎక్స్‌కవేటర్లు నదిలోకి దింపడం, దారులు ఏర్పాటు చేయడం వంతుల వారీగా నిర్వహిస్తూ ఇసుక నిల్వలను కొల్లగొడుతున్నారు. కొండపేట క్రాస్ రోడ్డు, చెన్నూరు కొత్తరోడ్డు, గోసుల కళ్యాణమండపం, ఇర్కాన్ సర్కిల్ వద్ద నాలుగు బ్యాచ్‌లు ఏర్పాటు చేసుకుని ఎలాంటి అవాంతరం లేకుండా ఇసుక అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. ఈవిషయంపై ఇటీవల పత్రికల్లో వచ్చినా ఖాతరు చేయడం లేదు. రెవెన్యూ సిబ్బంది సైతం జేబులు నింపుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మూడు నెలలుగా ఈ వ్యవహారం జోరుగా కొనసాగుతు న్నా పట్టించుకునే వారు లేకుండా పోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పట్టించుకోకపోతే పెన్నా పూర్తిగా ఎండిపోక తప్పదు.

నేడు, రేపు ఎంజేఆర్ కళాశాలలో మెగా జాబ్ మేళా

పీలేరు, జూన్ 10: పీలేరులోని ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నేడు, రేపు మెగాజాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ఛైర్మన్ ఎంపీ అవినాశ్‌రెడ్డి తెలిపారు. మేజిక్ బస్ ఫౌండేషన్ ఇండియా వారి సౌజన్యంతో రెండు రోజులపాటు జరగనున్న జాబ్ మేళాలో 50కి పైగా కంపెనీలు పాల్గొంటాయని, సుమారు వేయి ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు పూర్తి చేసిన వారందరూ జాబ్ మేళాలో పాల్గొనేందుకు అర్హులని వివరించారు. జాబ్ మేళాలో టెక్ మహీంద్రా, ట్రెండ్స్ ఇన్ఫర్మేషన్స్, జీఎస్ఎస్ గ్లోబల్, 24/7 ఏఐ, రోబోట్-ఈడీ, సాథర్లాండ్, టీం లీజ్, ఈటీఎస్ గ్లోబ్, క్యూస్ కార్ప్, అపోలో, ఫ్యూషన్ సి ఎక్స్ యంగ్ మైండ్స్, గ్రీన్ బ్లిస్, కాలిబర్ హెచ్‌ఆర్, ఎయిర్‌టెల్ తదితర కంపెనీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే తమ కళాశాలలో టీసీఎస్, ఆక్సెంచర్, డెల్టా ఎక్స్, ఆలోహ టెక్నాలజీస్, సూర్యటెక్ తదితర 30కి పైగా కంపెనీలు ప్రాంగణ ఎంపికలు నిర్వహించినట్లు తెలిపారు. తమ కళాశాలలో చదివిన ప్రతి విద్యార్థికీ ఉద్యోగిగా అవకాశం కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. మేజిక్ బస్ ఫౌండేషన్ ఇండియా ప్రతినిధి వెంకట మాట్లాడుతూ రెండు రోజుల జాబ్ మేళాలో ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఏడాదికి రూ.5.50 లక్షల వేతనం ఉంటుందని తెలిపారు. పీలేరు పరిసర ప్రాంత నిరుద్యోగులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మార్కెట్ పేరు మారుస్తారా? మార్చాలా?

● పాలక మండలి నిర్ణయం తీసుకోవాలి
● ప్రజల మనోభావాల మేరకే కూటమి నిర్ణయాలు
● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూగుట్ల మధుసూదన్‌రెడ్డి

పులివెందుల టౌన్, జూన్ 10: పట్టణంలో నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన రంగనాథస్వామి ఆలయం సమీపంలో ఏర్పాటుచేసిన కూరగాయల మార్కెట్‌కు శ్రీ రంగనాథ స్వామి కూరగాయల మార్కెట్‌గా పేరు నామకరణం చేస్తారా.. లేక మేమే చేయమంటారా అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూగుట్ల మధుసూదనరెడ్డి పులివెందుల మున్సిపల్ పాలక మండలిని ప్రశ్నించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్ఆర్ సీఎంగా ఉన్న సమయంలో నిర్మించిన ఈ కూరగాయల మార్కెట్‌ను రంగనాథస్వామి కూరగాయల మార్కెట్‌గా పిలిచేవారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత హిందూ మనోభావాలను దెబ్బతీసేలా వైఎస్ఆర్ కూరగాయల మార్కెట్‌గా పేరు మార్చారని, దీనిపై భారతీయ జనతా పార్టీ, హిందూ పరిషత్ వేదికతో కలసి అభ్యంతరం వ్యక్తం చేస్తూ గతంలో మున్సిపల్ కమిషనరుకు వినతిపత్రం కూడా అందించామన్నారు. ఈ కూరగాయల మార్కెట్ పేరును మారుస్తున్నట్లు మున్సిపల్ పాలక మండలి సమావేశం తీర్మానం చేయాలని, లేకుంటే కూటమి ఆధ్వర్యంలో అధికారికంగా పేరు మార్చేలా చేస్తామన్నారు. మన పులివెందుల ప్రాచీనత ప్రాధాన్యతను తెలిపే శ్రీరంగనాథస్వామి పేరును కచ్చితంగా పెట్టాలని దానిపై గతంలో ధర్నాలు, ర్యాలీలు కూడా చేయడం జరిగింది. అప్పుడు అధికారులు కచ్చితంగా మారుస్తామని చెప్పారన్నారు. కానీ కూరగాయల మార్కెట్ పేరును వైఎస్ఆర్ మార్కెట్‌గానే ఉంచడం జరిగిందని, త్వరితగతిన పులివెందుల మున్సిపల్ అధికారులు కౌన్సిల్‌లో చర్చించుకుని కచ్చితంగా పేరు మార్చాలని లేనిపక్షంలో కూరగాయల మార్కెట్ పేరును రంగనాథ స్వామి కూరగాయల మార్కెట్‌గా తామే మారుస్తామని హెచ్చరించారు, ప్రజా అభిప్రాయం మేరకు పేర్లు ఉండాలి కానీ, పార్టీలకు వ్యక్తులకు అనుకూలమైన పేర్లు ఉండరాదని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. కొంత మంది పులివెందుల లోని నాయకులు వారి స్వార్థ ప్రయోజనాలు, అధిష్టానం మెప్పు కోసం రంగనాధస్వామి కూరగాయల మార్కెట్‌కు వైఎస్ఆర్ కూరగాయల మార్కెట్‌గా మార్చారన్నారు. ఇకపై అలాంటివి సాగవన్నారు.

ప్రతిపాదనలకే పరిమితమైన వంతెన

పెద్దమండ్యం, జూన్ 10: పెద్దమండ్యం- గుర్రంకొండ రహదారి పెద్దమండ్యం సమీపంలో కుషావతినదిపై బ్రిడ్జి నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితమైంది. ఐదేళ్ల క్రితం పెద్దమండ్యం- గుర్రంకొండ రహదారి డబుల్ తారురోడ్లు పూర్తైనాయి. రోడ్డు అభివృద్ధి పనుల్లో భాగంగా జరగాల్సిన బ్రిడ్జి నిర్మాణం జాప్యం జరిగింది. తారురోడ్డు నిర్మాణ సమయంలో తుఫాన్ తాకిడికి ఉధృతంగా ప్రవహిస్తున్న కుషావతి ప్రవాహంలో జీపు కొట్టుకుపోయి బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న ఐదుగురిలో నలుగురు ప్రాణాపాయస్థితి నుంచి బయట పడగా ఒకరు మృతి చెందారు. అప్పుడు కుషావతినదిపై భారీ బ్రిడ్జి నిర్మాణానికి ఆర్అండ్‌బీ ప్రతిపాదన చేసినట్లు అధికారులు తెలిపారు. ఆరేళ్లు గడుస్తున్నా బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోవడంతో ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి ఏడాది వర్షాకాలంలో ఈ మార్గంలో ప్రయాణికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇకనైనా జిల్లా అధికారులు చర్యలు తీసుకొని కుషావతిపై త్వరలో బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



కుషావతినది ప్రవాహానికి ప్రయాణికుల కష్టాలు (ఫైల్‌ఫొటో)

పెద్దమండ్యం కుషావతినదిపై బ్రిడ్జి నిర్మాణ అభివృద్ధి పనులకు ఇటీవలే రూ. 4 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు పంపినట్లు ఆర్అండ్‌బీ ఏఈ శ్రీనివాసులు తెలిపారు.

పశువైద్య మండలి ఎన్నికల్లో డాక్టర్ గీతాప్రియ గెలుపు



కడప(రూరల్) జూన్ 10 : భారత పశువైద్య పట్టభద్రుల మండలికి 2024 జూన్ 8న నిర్వహించిన ఎన్నికల్లో కడప జిల్లా పశు సంవర్ధకశాఖ పరిధిలో పనిచేస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ గీతా ప్రియ ప్రత్యర్థిపై 12,999 ఓట్లతో రెండవ అతిపెద్ద మెజార్టీ విజయం సాధించారు. డాక్టర్ ఉమేష్ చంద్రవర్మ ప్యానల్‌లో డాక్టర్ గీతాప్రియతో పాటు 11 మంది సభ్యులు గెలుపొందారు. ఈ పోటీలో దేశవ్యాప్తంగా 93 మంది బరిలో నిలిచారు. ఈ సందర్భంగా డాక్టర్ గీతాప్రియ మాట్లాడుతూ తనకు ఘన విజయాన్ని అందించిన తెలుగు రాష్ట్రాల పశువైద్యులకు కృతజ్ఞతాభివందనాలు తెలియజేశారు. పశువైద్యుల శ్రేయస్సు, పశువుల ఆరోగ్య పరిక్షణ కోసం తమ వంతు చర్యలు చేపడతానన్నారు. పశువైద్య పట్టభద్రుల, నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి, పశువుల ఆసుపత్రులలో మౌలిక వసతుల ఏర్పాటుకు కృషిచేస్తానని తెలియజేశారు.

జడ్పీ ప్రావిడెంట్ ఫండు పట్టికలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్

● జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డి

కడప(రూరల్) జూన్ 10 : జిల్లా పరిషత్తు 2022-23 సంవత్సరం ప్రావిడెంట్ ఫండ్ సాంవత్సరిక పట్టికలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసినట్లు జడ్పీ సీఈవో ఎం. సుధాకర్‌రెడ్డి తెలిపారు. కడప జడ్పీ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులు వాటిని సరిచూసుకొని, అభ్యంతరాలుంటే తగు రుజువులతో జిల్లా పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఒక నెలలోపు అందిన అభ్యంతరములను మాత్రమే సవరించుటకు అనుమతిస్తామన్నారు.

కర్ణాటక బీర్లు స్వాధీనం.. విక్రేత అరెస్టు

మదనపల్లె టౌన్, జూన్ 10: కర్ణాటక బీర్లు విక్రయిస్తున్న మహిళను ఎస్ఈబీ పోలీసులు అరెస్టు చేసి 9 కర్ణాటక బీరుబాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ సీఐ రమేశ్‌రెడ్డి తెలిపారు. సోమవారం మదనపల్లె ఎస్ఈబీ స్టేషన్ పరిధిలోని కురబలకోట మండలం అప్పినాయనిపల్లెకు చెందిన కృష్ణప్ప భార్య బి.మల్లీశ్వరి(37) కర్ణాటక బీర్లు విక్రయిస్తుండగా అరెస్టు చేసి ఆమె వద్ద నుంచి 9 కర్ణాటక బీరుబాటిళ్లు స్వాధీనం చేసుకుని రిమాండుకు పంపామన్నారు. నాటుసారా అక్రమరవాణా, విక్రయాలు, కర్ణాటక మద్యం, గంజాయి విక్రయిస్తున్న వారిపై నిఘా పెట్టామని, చట్టాన్ని ఉల్లంఘిస్తే అరెస్టు చేస్తామని సీఐ చెప్పారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

నిమ్మనపల్లి, జూన్ 10: కుటుంబ సమస్యల కారణంగా ఓ వివాహిత విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాచ వేటివారిపల్లి పంచాయతి గొల్లపల్లికి చెందిన అశ్విని(23) ఇంట్లో సమస్యల కారణంగా పురుగుమందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడగా వెంటనే కుటుంబీకులు గమనించి ఆమెను మదన పల్లి ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. దీంతో అశ్విని కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు ఎస్ఐ తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరి మృతి



ప్రమాదానికి గురైన ద్విచక్ర వాహనం

సుండుపల్లె, జూన్ 10: ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు మృతి చెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం రాత్రి సుండుపల్లె మండలంలోని ముడుంపాడు క్రాస్‌కు కూతవేటు దూరంలో అదే గ్రామానికి చెందిన రెడ్డెయ్య, రామలింగయ్య (55) బైక్‌పై వెళుతుండగా, ఎదురుగా బైక్‌పై వస్తున్న పెద్దపల్లికి చెందిన నరేశ్ ఢీకొన్నాడు. ఈ సంఘటనలో రామలింగయ్య మృతి చెందగా, మిగిలిన ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో జెర్సీ ఆవు..



ఆవు మృతకళేబరం

గాలివీడు, జూన్ 10: మండలంలోని చీమలచెరువుపల్లె పంచాయతీ కొప్పులవాండ్లపల్లెలో దుద్దికుంట మోహన్‌రెడ్డికి జెర్సీ ఆవు విద్యుదాఘా తంతో మృతి చెందింది. సోమవారం ఆవును పొలంలో మేతకు వదలగా ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర తీగకు తగులు కుని మృతి చెందిందని బాధితుడు తెలిపాడు. 90 వేలు విలువ చేసే ఆవు మృతి చెందడంతో తమ జీవనాధారం కోల్పోయినట్లు వివరించాడు.

గుండెపోటుతో టీడీపీ నేత..



మృతదేహాన్ని సందర్శించిన మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి

జమ్మలమడుగు, జూన్ 10: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని నారాపురం వెంకటేశ్వరస్వామి ఆలయానికి సమీపంలో నివాసముంటున్న టీడీపీ మైనార్టీ నేత బాషామోద్దీన్ (76) ఆదివారం రాత్రి మృతిచెందారు. టీడీపీ ఆవిర్భావం పొన్నపురెడ్డి శివారెడ్డి, రామసుబ్బారెడ్డి వెంట ఉండి టీడీపీకి సేవ చేశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం రాత్రి హార్ట్‌ఎటాక్‌తో మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, పలువురు నేతలు సోమవారం ఉదయాన్నే మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి, కొమెర్లమోద్దీన్, జె.మున్నా, వంగల నాగేంద్రయాదవ్, చిన్నపసుపుల శ్రీనివాసులరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలతో రైతుల బెంబేలు

జమ్మలమడుగు, జూన్ 10: ట్రాన్స్‌పార్మర్ల చోరీలు అధికం కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మైలవరం మండలంలోని పొన్నంపల్లె, తొర్రివేముల, గంగులనారాయణపల్లె, తదితర గ్రామాల్లో రైతుల ట్రాన్స్‌పార్మర్లు చోరీలు జరిగాయి. తాజాగా సర్వేనంబరు 317, 318 లోని మూరబోయిన పెద్దదస్తగిరికి చెందిన పొలంలో ఏర్పాటు చేసి ట్రాన్స్‌ఫార్మర్ చోరీ కావడంతో ఏఈ పీతాంబర్‌రెడ్డికి ఫిర్యాదు చేశాడు. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌కు ఏర్పాటుకు రూ.70 వేలు ఖర్చు అవుతుందని బాధితుడు తెలిపాడు. ఇటీవల మైలవరం మండలంలో వరుసగా 11 ట్రాన్స్‌పార్మర్లు చోరీకి గురయ్యాయని రైతులు అంటున్నారు. ఈ విషయంపై ఏఈ పీతాంబర్‌రెడ్డిని వివరణ కోరగా ట్రాన్స్‌పార్మర్ల చోరీపై ఫిర్యాదులు అందాయని, ఇప్పటికే 8 కేసులు నమోదు చేశామని, తాము కూడా పోలీసు వారికి సమాచారం అందించామన్నారు. కాగా, ట్రాన్స్‌పార్మర్ల చోరీకి సంబంధించి కొంతమందిని పెద్దముడియం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది

కారు, ద్విచక్ర వాహనం ఢీ- ఒకరు దుర్మరణం



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

చిన్నమండెం, జూన్ 10: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో వెంకట్రమణ (36) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ రమేశ్‌బాబు తెలిపారు. వండాడి గ్రామ పంచాయతీ తూర్పుపల్లె హరిజనవాడకు చెందిన వెంకట్రమణ బోర్‌వెల్స్‌లో పనిచేస్తుంటాడు. సోమవారం రాయచోటినుంచి బైక్‌పై వస్తుండగా తూర్పుపల్లె హరిజనవాడ వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన అతనిని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి భార్య వండాడి కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి

● యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా

కడప (ఎడ్యుకేషన్), జూన్ 10 : నూతనంగా కొలువుదీరిపోయే కొత్త ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్‌బాబు కోరారు. సోమవారం యూటీఎఫ్ భవన్‌లో యూటీఎఫ్ జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యారంగాన్ని కుక్కలు చింపిన విస్తరిలా తయారు చేసిందని, ఉపాధ్యాయ నియామకాలు చేపట్టకుండా పాఠశాలల విలీనం, మూడురకాల సిలబస్‌లు ప్రవేశపెట్టడం, ఒకే మాధ్యమంలోనే విద్యను బోధించాలనడం, ఉపాధ్యాయులను బోధనకు పరిమితం చేయకుండా బోధనేతర పనుల్లో భాగస్వామ్యంచేయడం, అనవసరమైన యాప్‌లతో వేధించడం తదితర కారణాలతో విద్యారంగాన్ని భ్రష్టుపట్టించిందన్నారు. న్యాయబద్ధమైన సమస్యలపరిష్కా రం కోసం పోరాడుతున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించకుండా ప్రతిదాడులకు పూనుకుని కేసులు పెట్ట డం పోలీసుస్టేషన్లలో నిర్బంధించడం దుర్మార్గమ న్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలు చెల్లించకుండా 1వ తేదీ జీతం ఇవ్వడమే గొప్ప అనే పరిస్థితులు గత ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. సమస్యలు పరిష్కరించాలంటే ఉద్యోగులు మా కాళ్లు పట్టుకునే నేర్పు ఉండాలంటూ మంత్రులు మాట్లాడారని, ఇలాంటి నియంతృత్వ వైఖరి వల్లనే గత ప్రభుత్వం పతనమైందన్నారు. కాగా నూతన ప్రభుత్వం విద్యశాఖను, విద్యారంగాన్ని బలోపేతం చేయాలని, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని కోరారు. యూటీఎఫ్ నాయకులు సుజాతరాణి, నరసింహారావు, సీవీ రమణ, ఎజాస్ అహ్మద్, చెన్నయ్య, చంద్ర ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించాలి: సీపీఐ

కడప (సెవెన్‌రోడ్స్), జూన్ 10:లక్షలాది మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే కడప ఉక్కుఫ్యాక్టరీ నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషిచేయాలని సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర మాట్లాడారు. కరువు వలసలు ఆత్మహత్యలకు నిలయంగా ఉన్న జిల్లాలో దివంగత సీఎం వైఎస్ ఉక్కుఫ్యాక్టరీ నిర్మాణానికి శ్రీకారం చుడితే, తరువాత జగన్ తాను అధికారంలోకి వచ్చిన ఆరు మాసాల్లో పూర్తి చేస్తానని నమ్మబలికి అధికరంలోకివచ్చి ఐదు సంవత్సరాల్లో రెండుసార్లు శిలాఫలకాలు వేసి ఎలాంటి నిర్మాణం చేపట్టకపోగా, కేంద్ర ప్రభుత్వం ద్వారా కూడా సాధించలేకపోయారన్నారు. చంద్రబాబు సంకల్పిస్తే ఫ్యాక్టరీ నిర్మాణం జరిగే అవకాశం ఉందన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎంవీ సుబ్బారెడ్డి, జిల్లాసమితి సభ్యులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'నీట్ పరీక్ష స్కాంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి'

కడప (సెవెన్‌రోడ్స్), జూన్ 10 : నీట్ పరీక్ష స్కామ్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి ప్రతిభగల విద్యార్థులకు న్యాయం చేయాలని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట ప్రధాన కార్యదర్శి డీఎం ఓబులేసు యాదవ్ డిమాండ్ చేశారు. గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. నీట్ యూజీ 2024 ఫలితాల్లో 67 మంది విద్యార్థులకు ఆలిండియా ఫస్ట్ ర్యాంకు, ఇందులో ఏడుగురు హర్యానాకు చెందిన ఒకే ఎగ్జామ్ సెంటరు వారు కావడం, అలాగే వారికి 720 మార్కులు రావడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. అదే సెంటరులో ఎగ్జామ్ రాసిన జాన్వీ అనే విద్యార్థిని 179 ప్రశ్నలను అటెంప్ట్ చేయగా అందులో 163 కరెక్ట్ అయ్యాయని, అలా చూసుకుంటే ఆమెకు 636 మార్కులు రావాలని, కానీ 720 ఎలా వచ్చాయని ప్రశ్నించారు. దీంతో అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. ఎన్‌టీఏ విడుదల చేసిన పరీక్ష ఫలితాలపై పేపరు లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి ప్రతిభగల విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జీఆర్‌ఎస్‌వైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పవన్, జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డిసాయి పాల్గొన్నారు.

నీట్ పరీక్ష ఫలితాలపై విచారణ చేపట్టాలి: డీవైఎఫ్ఐ

కడప (సెవెన్‌రోడ్స్), జూన్ 10 : నీట్ పరీక్ష 2024 ఫలితాలు, పరీక్ష నిర్వహణపై విద్యార్థులు తల్లిదండ్రుల నుంచి అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నందున పరీక్ష నిర్వహణ తీరుపై సమగ్ర విచారణ జరిపించి విద్యార్థులకు న్యాయం చేయాలని డీవైఎఫ్ఐ కడప జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ డిమాండ్ చేశారు. కడప పాతబస్టాండు నందు గల కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. 2024 నీట్ పరీక్షల నిర్వహణ బాధ్యత చేపట్టిన ఎన్‌టీఏ వ్యవహరించిన తీరుపై దేశవ్యాప్తంగా అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నందున ప్రత్యేక దర్యాప్తు సంస్థలతో సమగ్ర న్యాయవిచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

వేల్పులలో మలేరియా వ్యతిరేక మాసోత్సవం

వేముల, జూన్ 10 : ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వేల్పులలో మలేరియా మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య మాట్లాడుతూ దోమ పుట్టుకను నివారించాలని, దోమ కాటు ద్వారా మలేరియా, డెంగ్యు, చికున్‌గున్యా ఫైలేరియా, మెదడువాపు వంటి ప్రమాదకర వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందన్నారు.

రాష్ట్రంలో రాక్షసపాలన నుంచి విముక్తి

● టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్


రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న హరిప్రసాద్

కడప (ఎడ్యుకేషన్), జూన్ 10 : రాష్ట్రంలో రాక్షసపాలన నుంచి ప్రజలకు విముక్తి లభించిందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్ తెలిపారు. సోమవారం రిమ్స్ ఆసుపత్రిలో టీడీపీ ఘన విజయాన్ని కడప అసెంబ్లీ నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగురవేయడాన్ని పురస్కరించుకుని రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కడప నగరంలో 20 సంవత్సరాల తరవాత టీడీపీ జెండా ఎగరవేయడం జరిగిందన్నారు. త్వరలో చంద్రబాబునాయుడు సుస్థిరపాలన అందిస్తారని ప్రజలకు కావలసిన అన్ని వసతులు కల్పిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటరు బండి బాబు, మూర్తి, బాల, శ్రీనివాసులు, మన్యం చలపతిరావు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన రెడ్డప్పగారి కుటుంబ సభ్యులు


చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాధవీరెడ్డి కుటుంబ సభ్యులు

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 10 : విజయవాడ టీడీపీ అధినేత నారాచంద్రబాబు నివాసంలో సోమవారం కడప ఎమ్మెల్యే ఆర్.మాధవీరెడ్డి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. చంద్రబాబుకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మొదటిసారిగా ఎమ్మెల్యేగా పోటీ చేసి అఖండ విజయం సాధించిన మాధవీరెడ్డిని చంద్రబాబునాయుడు అభినందించారు. మాధవీరెడ్డి, శ్రీనివాసరెడ్డి కుమారుడు శ్రవణ్‌రాజ్‌రెడ్డి, కుమార్తె ప్రియాంకరెడ్డి, సీనియర్ నాయకులు బోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్‌డీఏ కూటమి విజయం ఉద్యోగ ఉపాధ్యాయులదే

● ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం

కడప (ఎడ్యుకేషన్), జూన్ 10 :రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి విజయం ఉద్యోగ, ఉపాధ్యాయులు సాధించిన ఘన విజయమని ఎస్సీఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట ప్రధాన కార్యదర్శి మేకల శివార్జున తెలిపారు. సోమవారం కడప నగరం ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సాధారణ ఎన్నికల్లో టీడీపీ అఖండ విజయం సాధించిందన్నారు. చంద్రబాబునాయుడు ఉపాధ్యాయ బదిలీల్లో కౌన్సెలింగ్ విధానం ప్రవేశపెట్టి ఉపాధ్యాయ ఆత్మగౌరవం నిలబెట్టారన్నారు. ఆ విధానమే నేటికీ అమలువుతోందన్నారు. 12వ పీఆర్సీ పెండింగు డీఏలు 117 జీఓ రద్దు తదితర సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలుగు ప్రజలకు రాజకీయ చైతన్యం కలిగించిన ఎన్టీఆర్ వారసుడుగా రాజకీయ రంగంలోనూ అశేష ప్రజాదరణ పొందిన నందమూరి బాలక్రిష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

చంద్రబాబును కలిసిన గోవర్ధనరెడ్డి


చంద్రబాబును సత్కరిస్తున్న గోవర్ధనరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 10 : ఉండవల్లిలో సోమవారం టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడిని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.గోవర్ధనరెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే దుశ్శాలువాతో చంద్రబాబును సత్కరించారు. అనంతరం చంద్రబాబు గోవర్ధనరెడ్డిని ఎన్నికల్లో బాగా పనిచేసినందుకు గాను ప్రశంసించారు.

విజయపరంపర కొనసాగిస్తున్న బాలయ్య

కడప (మారుతీనగర్), జూన్ 10: అటు సినిమా, ఇటు రాజకీయ రంగంలో తిరుగులేని రీతిగా నందమూరి బాలకృష్ణ రాణిస్తున్నారని బాలకృష్ణ అభిమాన సంఘం జిల్లా నాయకుడు ఇబ్రహీంఖాన్, ఖాసీం, చికెన్‌బాష, జగన్‌మోహన్‌రెడ్డి కొనియాడారు. బాలకృష్ణ 65వ జన్మదినం సందర్భంగా బాలకృష్ణ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు వీరయ్య సూచనల మేరకు సోమవారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయ సమీపంలో గల ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహంలో గల అనాథలకు అన్నదానం చేశారు.

వేములలో...

హిందూపురం ఎమ్మెల్యే సినీ హీరో నందమూరి బాలక్రిష్ణ జన్మదిన వేడుకలను వేములలో ఘనం గా నిర్వహించారు. షేక్‌బాబ్జి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధిరెడ్డి సతీమణి పేర్ల లక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు.

వేంపల్లెలో బాలక్రిష్ణ జన్మదిన వేడుకలు

వేంపల్లె, జూన్ 10 : హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలక్రిష్ణ జన్మదిన వేడుకలను తెలుగు తమ్ముళ్లు ఘనంగా జరుపుకున్నారు. బాలక్రిష్ణ అభిమానులు యాసిన్, చైతన్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను టీడీపీ మైనార్టీ సెల్ మాజీ డైరెక్టరు షబ్బీర్, మాజీ గ్రంధాలయ చైర్మన్ బాలస్వామిరెడ్డిలు కట్ చేసి పంచిపెట్టారు.

ఘనంగా బాలక్రిష్ణ పుట్టిన రోజు వేడుకలు

కమలాపురం రూరల్, జూన్ 10 : సినీ నటుడు హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలక్రిష్ణ పుట్టినరోజు వేడుకలను నందమూరి ఫ్యాన్స్ ఆధ్వర్యంలో టీడీపీ ముస్లిం మైనార్టీ కడప పార్లమెంటు అధ్యక్షుడు ఖాదర్‌బాషా ఘనంగా నిర్వహించారు. సోమవారం బాలక్రిష్ణ పుట్టిన రోజు సందర్భంగా కమలాపురం టీడీపీ కార్యాలయం నందు భారీ కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందమూరి నటసింహం, బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ చైర్మన్, హిందూపురం ఎమ్మెల్యే బాలక్రిష్ణ జన్మదనం సందర్భంగా కమలాపురం నియోజకవర్గం నందమూరి ఫ్యాన్స్ సహకారంతో వేడుకలు ఘనంగా జరిగాయి.

ఆ పాత మధురం.. ఆధునికం అనుసరణీయం

వ్యవసాయరంగంలో సాంకేతిక విప్లవం పెద్ద సునామీనే సృష్టించినా నేటికీ సాంప్రదాయ పద్ధతులకు ఆదరణ తగ్గలేదు.. పురాతన వ్యవసాయ పనిముట్లు చాలా వరకు కనుమరుగై వాటి స్థానంలో యంత్రాలు వచ్చేశాయి. కానీ నేటికీ అక్కడక్కడా సాంప్రదాయ సేద్యం, పనిముట్లు కనిపిస్తున్నాయి అనడానికి ఇదో మచ్చుతునక... ఈ ఖరీఫ్ సీజన్‌లో నారుమడిని సిద్ధం చేసేందుకు రైతులు ఇటు ట్రాక్టర్, అటు నాగలిని ఉపయోగిస్తున్నారు.


కనుపర్తి వద్ద నారుమడులను ఎడ్లతో సిద్ధం చేసుకుంటున్న రైతు


జీలుగను ట్రాక్టరుతో తొక్కిస్తున్న అన్నదాత

- ● జీలుగ తొక్కించి.. నారు పోసి..
- ● బోర్ల కింద 1200 ఎకరాల్లో వరి సాగుకు రైతన్న సిద్ధం
- ● ఖరీఫ్ సేద్యంలో రైతులు బిజీ


బలసిగాయపల్లె వద్ద నార్లు పోసిన దృశ్యం

చెన్నూరు, జూన్ 10 : ఖరీఫ్ సీజన్ మొదలవుతున్న నేపథ్యంలో మండలంలో వ్యవసాయ బోర్ల కింద రైతులు వరి సాగుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే జీలుగ పోసిన రైతులంతా జీలుగలు ట్రాక్టర్లతో తొక్కించి పచ్చిరొట్ట ఎరువుగా భూసారం పెరిగేందుకు పనులు చేపట్టారు. అలాగే పలుచోట్ల నారుమళ్ల సిద్ధం చేయడం, ఎడ్లతో కలియదున్ను తూ నారు పోసేందుకు సిద్ధం చేశారు. అంతేకాక ఇంకొన్ని చోట్ల ఇ ప్పటికే నారు పోయడంతో వాటిని త్వరలో నాటేందుకు మడిని కూడా సిద్ధం చేసుకుంటున్నారు. దౌలతాపురం, కనుపర్తి, కొండపేట, బలసింగాయపల్లె, రామనపల్లె తదితర ప్రాంతాల్లో బోరున్న రైతులంతా ఈ వ్యవసాయ పనులు ముమ్మరంగా చేపట్టారు. సుమారు 1200 ఎకరాల్లో ముందుగానే రైతులు వరి సాగుకు సిద్ధమయ్యారని మండల వ్యవసాయాధికారిణి శ్రీదేవి తెలిపారు. ఇప్పటికే రైతులకు జీలుగలు, జనుము విత్తనాలు పంపిణీ చేశామని, కొందరు రైతులు ముందుగానే బయట మార్కెట్లో జీలుగ విత్తనాలు కొని పచ్చిరొట్ట ఎరువుగా సాగు చేసుకున్నారని తెలిపారు. పెన్నానదిలో నీటి ప్రవాహం కూడా ఉండటం, బోర్లలో పుష్కలంగా నీరు రావడంతో రైతులు ఉత్సాహంగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

చెన్నకేశవుడికి పూజలు

చెన్నూరు, జూన్ 10 : పుత్తా చైతన్యరెడ్డి భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలవడంపై చెన్నూరుకు చెందిన ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి కొండాల చెన్నయ్య, మాజీ జడ్పీటీసీ చిన్నయ్య పుష్పగిరికి చెన్నకేశవుడికి సోమవారం పూజలు చేసి 108 కొబ్బరికాయలు కొట్టారు. అలాగే ఎన్నికల వాగ్దానాల్లో భాగంగా పుష్పగిరికి పెన్నానదిపై రాకపోకలకు వంతెన ఏర్పాటు చేస్తామని చెప్పారు కాబట్టి నెరవేర్చాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి బావమరిది, సీనియర్ టీడీపీ నేత పెడబల్లె పద్మనాభరెడ్డి, బీసీ సెల్ మండల కర్యాదర్శి కుందేటి క్రిష్ణయ్య, పట్టణ అధ్యక్షుడు ఆకుల చలపతి, ఉపాధ్యక్షుడు కల్లూరు ఓబుల్‌రెడ్డి, గోదిన శ్రీనివాసులు, బాలిక్రిష్ణారెడ్డి, పిచ్చయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

కడప (ఎడ్యుకేషన్), జూన్ 10 : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి నబీవుల్లా తెలిపారు. సోమవారం కడప నగరం వక్కలపేట మున్సిపల్ ఉర్దూ ప్రైమరీ స్కూలు ప్రాంతంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే సౌకర్యాలను తల్లిదండ్రులకు తెలియజేపి ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. అనంతరం మాట్లాడుతూ తీర్చిదిద్దడానికి క్వాలిఫైడ్ టీచర్లుతో విద్యాబోధన ఉంటుందన్నారు.

టూటౌన్ సీఐ ఇబ్రహీంకు సన్మానం


సీఐని సన్మానిస్తున్న దృశ్యం

కడప (నాగరాజుపేట), జూన్ 10 : జిల్లాలో సా ర్వత్రిక ఎన్నికలు, ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా జరగడానికి సహకరించిన టూటౌన్ సీఐ ఇబ్రహీం కు టీడీపీ నాయకులు లయన్ పఠాన్ ఖాదర్‌బాషా, షేక్ అహ్మదుల్లా, చాంద్‌బాషా అభినందించారు. సోమవారం ఆయన్ను కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతిభద్రతలను పటిష్టంగా కాపాడటం ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌస్‌నగర్ యూత్ హబీబుల్లా, షరీఫుల్లా, జిలానీ, సోను తదితరులు పాల్గొన్నారు.

కూటమి సంబరాలు

వేంపల్లె, జూన్ 10 : దేశ ప్రధానిగా నరేంద్రమోడీ మూడోసారి ఎంపికై ప్రమాణ స్వీకారం చేయడంతో బీజేపీ, టీడీపీ నాయకులు సంబరాలు జరిపారు. బీజేపీ జిల్లా కార్యదర్శి గాలి హరిప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. బీజేపీసీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, టీడీపీ మండల ఉపాధ్యక్షులు భద్ర తదితర నాయకులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

కడప (నాగరాజుపేట), జూన్ 10 :భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ కడప జిల్లా సమితి రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ మద్దిలేటి, జిల్లా ప్రధాన కార్యదర్శి లింగన్న విజ్ఞప్తి చేశారు. సోమవారం లేబర్ ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్ శైలజకు వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లేబర్ డిపార్ట్‌మెంటులో సంక్షేమ కార్డులు పొందిన 22లక్షల మంది కార్మికులు కాకుండా కార్డులు పొందని వారు సుమారు 30లక్షల మంది ఉన్నారన్నారు. వీరందరూ వివిధ రంగాల్లో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు.

'పేదలకు అండగా నిలవాలి'

కడప (సెవెన్‌రోడ్స్), జూన్ 10: కొత్త ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలవాలని ఏపీ మాలమహానాడు వ్యవస్థాపకుడు, రాష్ట్ర అధ్యక్షుడు జాకట విజయశేఖర్ పిలుపునిచ్చారు. సోమవారం విజయశేఖర్ జన్మదినం సందర్భంగా ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విజయశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కొత్త ప్రభుత్వం రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

అధిక ఫీజులను నియంత్రించాలి

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 10: కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలలో అధిక ఫీజులు, అక్రమ అడ్మిషన్లను నియంత్రించాలని విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు భాస్కర్, కొండయ్య, నరేష్ పేర్కొన్నారు. సోమవారం స్టూడెంట్ ప్రొటెక్షన్ ఫోర్స్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు విద్యను వ్యాపారం చేస్తున్నాయని విమర్శించారు. అధికారులు స్పందించి అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

శివాలయంలో అన్నదానం

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 10: స్థానిక శివాలయంలో సోమవారం శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. రిటైర్డు ఆంధ్రాబ్యాంకు మేనేజర్ మూలా వెంకటరామిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన సతీమణి మూలా లక్ష్మీదేవి, కుమారులు మూలా శ్రీకాంత్‌రెడ్డి, సుమంత్‌రెడ్డి సహకారంతో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా శివోహం అన్నప్రసాద సేవా సంఘం అధ్యక్షుడు రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిసోమవారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్జెల వెంకటేశ్వరరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, నారాయణ, విజయకుమార్, లింగారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

దెబ్బతిన్న కల్వర్టు



కుమ్మర కొట్టాలలో దెబ్బతిన్న కల్వర్టు

ప్రొద్దుటూరు, జూన్ 10 : మున్సిపాలిటీ పరిధిలోని కుమ్మర కొట్టాలనుంచి ఆశ్రమం వీధికి వెళ్ళే మార్గంలో రోడ్డు కల్వర్టు తీవ్రంగా దెబ్బతింది. దాదాపు 20 రోజులు కావస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆమార్గంలో మోటారు సైకిళ్ళలో వెళ్ళే వారు ప్రమాదాల బారిన పడే అవకాశం వుంది. రాత్రివేళ కల్వర్టు దెబ్బతిన్నది కానరాక ప్రమాదాల బారిన పడే అవకాశం వుంది. వెంటనే అధికారులు కల్వర్టు మరమ్మతు చర్యలు చేపట్టాలని మాజీ కౌన్సిలర్ గంజికుంట అంజనేయులు కోరారు.

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 10: వైసీపీ పాలనలో నిర్వీర్యమైన భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏరియా సమితి ఉపాధ్యక్షుడు శేషారెడ్డి, ప్రధాన కార్యదర్శి చిన్న ఓబన్న సోమవారం కార్మిక శాఖ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2006లో ప్రారంభమైన భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు 2019 వరకు సక్రమంగా సాగినా వైసీపీ పాలనలో నిర్వీర్యం చేసి నిధులను ఇతర పథకాలను మళ్లించారని విమర్శించారు. టీడీపీ కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని, ఎన్నికల మేనిఫేస్టోలో హామీ ఇచ్చిందన్నారు.

కుక్కల స్వైర విహారం

చిన్నపిల్లలు, వృద్ధులపై దాడులు ● పట్టించుకోని మున్సిపల్ సిబ్బంది



వీధుల్లో స్వైర విహారం చేస్తున్న కుక్కలు

బద్వేలు రూరల్, జూన్ 10 : పట్టణంలో ఏ సందులో చూసినా పది నుంచి పదిహేను కుక్కల వరకు ఉంటున్నాయి. అయితే ఇటీవల దాదాపు సంవత్సర కాలం నుంచి కుక్కలు మనుషుల మీదకు దాడి చేస్తున్నాయి. చిన్నపిల్లల మొదలు వృద్ధుల వరకు కుక్కల దాడిలో గాయపడ్డ సంఘటనలు పదుల సంఖ్యలో ఉన్నాయి. అయితే మున్సిపల్ అధికారులు కుక్కలను పట్టి బయటకు తరలించడంలో నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు ప్రజల నుంచి వెల్లువెత్తుతున్నాయి.

35వార్డుల్లో అధిక సంఖ్యలో కుక్కలు..: మున్సిపాలిటీ పరిధిలోని పట్టణ గ్రామీణ ప్రాంతాలను కలుపుకుని 35 వార్డులున్నాయి. దాదాపు 50, 60 కాలనీలు ఉన్నాయి. ఈ ప్రాంతాల న్నింటిలో సందుకు పది పదిహేను చొప్పున వందల సంఖ్యలో వీధి కుక్కలు వీధుల్లోనే తిరుగుతూ ఆయా ఇళ్ల వద్దనే ఉంటున్నాయి. అయితే ఆ వీధిలోని పిల్లలు ఒంటరిగా వస్తున్న వారిపైకే దాడి చేసి గాయపరిచిన ఘటనలు ఇటీవల ఎన్నో జరిగాయి. వందల సంఖ్యలో కుక్కలు ఉన్నప్పటికీ పలుమార్లు దాడుల ఘటనలు పత్రికల్లో ప్రచురితమైనప్పటికీ మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారు.

ఇటీవల జరిగిన కుక్కల దాడులు..: ఇటీవల కాలంలో గాండ్లవీధిలో కుక్కల దాడిలో పిల్లల నుంచి వృద్దుల వరకు గాయపడ్డారు. గత రెండురోజుల క్రితం ఓ విద్యార్థి ఒంటరిగా వెళుతుంటే అతనిపై దాడి చేసింది. దీంతో కాలికి చేతికి తీవ్రగాయాల య్యాయి. అలాగే రాజుగారివీధి, దూదేకులవీధి, రెడ్డయ్యమఠం, పలు ప్రాంతాల్లో కుక్కలు మనుషుల పైకి దాడి చేసిన ఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్ అధికారులు కుక్కలను పట్టి బయటకు తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

మట్కా, క్రికెట్ బుకీలను టీడీపీలోకి తీసుకోవద్దు

ప్రొద్దుటూరు నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి పీఎండీ నజీర్



మాట్లాడుతున్న పీడీఎం నజీర్

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 10: తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మట్కా, క్రికెట్, బుకీలు ఆ పార్టీలో చేరడానికి తెగ ఆరాటపడుతున్నారని, వారిని తీసుకోవద్దని కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎండీ నజీర్ పేర్కొన్నారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో క్రికెట్ బుకీలే కౌన్సిలర్ల అవతారమెత్తారని వారు అధికార గర్వంతో జిన్నారోడ్డు, దస్తగిరిపేట, ఇస్లాంపుర, మట్టి మసీదు వీధి ప్రాంతాల్లో ఇళ్ల వద్దకు వెళ్లి బెదిరింపులకు పాల్పడిన సంఘటనలు ఎన్నో ఉన్నాయన్నారు. ప్రొద్దుటూరు పట్టణంలో క్రికెట్ బెట్టింగ్ మాఫియా కొనసాగుతున్నా పోలీసులు వైసీపీ నాయకుల ఒత్తిడితో బుకీలపై ఏరోజూ చర్యలు తీసుకోలేదని విమర్శించారు. మట్కా, క్రికెట్ బుకీలు తెలుగుదేశం పార్టీలో చేరుతుండడంపై ప్రజల్లో చర్చ జరుగుతోందని పేర్కొన్నారు. ఆనాడు వైసీపీలో ఉన్న క్రికెట్ బుకీలు నోటికొచ్చినట్లు మాట్లాడి ఇష్టం వచ్చినట్లు దూషించారని, ఆ నాయకులనే తెలుగుదేశం పార్టీలో ఎలా చేర్చుకుంటారని ప్రశ్నించారు. టీడీపీ ప్రభుత్వం ద్వారా ప్రయోజనం పొందడానికి, క్రికెట్ బెట్టింగ్‌లను కొనసాగించాలన్న స్వార్థంతోనే వారు తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారని తెలిపారు. నమ్మి గెలిపించిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా క్రికెట్ బుకీలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు జిలానీబాష మాట్లాడుతూ కుందూ, పెన్నా వరదకాలువను పూర్తి చేసి పట్టణ ప్రజల దాహార్తిని తీర్చడానికి వరదరాజులరెడ్డి కృషి చేయాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు మహ్మద్ ఆలీ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వాగులు, వంకల ఆక్రమణలపై దృష్టిసారించాలి

బద్వేలు, జూన్ 10: బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని ఆక్రమణకు గురైన వాగులు, వంకలు, మోరీలపై ప్రత్యేక దృష్టిసారించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి బాలు, జిల్లా సమితి సభ్యుడు పి.వెంకటరమణ మాట్లాడుతూ పలు వాగుల ఆక్రమణల కారణంగా పట్టణలో వర్షపు నీరు రోడ్ల మీదకు వచ్చి ప్రజలు, వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ నాయకులు మునగల సుబ్బరాయుడు,రమణ, రాజకుమార్, మోహన్‌రెడ్డి, బాష, రామసుబ్బారెడ్డి, వెంకటేష్ , నవీన్ తదితరులు పాల్గొన్నారు.

విలేజీ హెల్త్ క్లినిక్ పరిశీలన



వైద్యసిబ్బందికి సూచనలు ఇస్తున్న దృశ్యం

బద్వేలు రూరల్, జూన్ 10 : మండల పరిధిలోని తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని అనంతరాజపురం విలేజీ హెల్త్‌క్లినిక్‌ను సోమవారం నేషనల్ క్వాలిటీ అసెస్‌మెంటు టీం డాక్టర్ మిథిలీస్ చంద్రసూరి, డాక్టర్ రాఘవేంద్రరావు పరిశీలించారు. ఈ సందర్భంగా హెల్త్ క్లినిక్‌లోని రికార్డులను పరిశీలించారు. అనంతరం వైద్యసిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వినయ్‌కుమార్, రమేశ్, హెల్త్ ఎడ్యుకేటరు వెంగయ్య జనార్ధన, కమ్యునిటీ హెల్త్ ఆఫీసరు ప్రభావతి, రాధ, సుస్మిత, 108 సిబ్బంది పాల్గొన్నారు.

కల్తీ ఎరువులపై నిఘా పెట్టండి

ఏడీఏ నాగరాజుకు వినతి పత్రం అందజేత

బద్వేలు, జూన్ 10: కల్తీ ఎరువులు, విత్తనాలను విక్రయిస్తున్న ఎరువుల దుకాణాలపై చర్యలు చేపట్టాలని కోరుతూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో అగ్రికల్చర్ ఏడీఏ నాగరాజుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. రైతులకు కల్తీ విత్తనాలు విక్రయిస్తున్న దుకాణాలను పరిశీలించాలని కోరారు. అనంతరం డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్ షరీఫ్, నాగార్జున రూరల్ కార్యదర్శి బాల గురవయ్య, ఉపాధ్యక్షులు యువరాజ్, ఆంజ నేయులు, ట్రెజరర్ సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలకు పేర్లు నమోదు చేసుకోండి

మైదుకూరు, జూన్ 10 : పచ్చిరొట్ట విత్తనాలు, జనుములు, పిల్లిపెసర లు అవసరమగు రైతులు తమ పరిధిలోని ఆర్బీకేలలో పేరు నమోదు చేసుకోవాలని ఏవో లక్ష్మీ ప్రసన్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలానికి 220 క్వింటాళ్ళ జనుములు, 5 క్వింటాళ్ళ పిల్లి పెసర కేటాయించారని, 50 శాతం సబ్సిడీతో ఇస్తామన్నారు. రైతులు తమ పట్టాదారు పాసు పుస్తకం, 1 బీ, ఆధార్, సెల్ తీసుకొని రావాలని కోరారు

కొండాపురం..: మండలంలోని రైతులకు 10 క్వింటాళ్ల పచ్చిరొట్ట ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఏవో రామాంజులరెడ్డి తెలిపారు.అదేవిధంగా 30 క్వింటాళ్ల లేపాక్షి రకం వేరుశనగ కాయలు అందుబాటులో ఉన్నాయన్నారు.కావలసిన రైతులు ఆర్బీకేలలో సంప్రదించాలని ఎవో తెలిపారు.

భక్తులకు అన్నదానం

చాపాడు, జూన్ 10: మండలంలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవాలయంలో సోమవారం భక్తులకు అన్నదానం చేశారు. ప్రతి సోమవారం భక్తులకు అన్నదానం చేయడం కొన్నేళ్ల నుంచి ఆనవాయితీగా వస్తోంది. టీడీపీ గెలువగానే టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. భక్తులు ఇచ్చిన చందాలతో అన్నదానం చేస్తున్నారు. పలువురు భక్తులు స్వామివారికి రూ.36 వేలు సోమవారం విరాళంగా ఇచ్చినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. అన్నదానంలో టీడీపీ నాయకులు శ్రీనివాసులు, పి.వి.నారాయణయాదవ్, శ్రీనివాసులయాదవ్, మేకల బాబు, గుత్తి నారాయణయాదవ్, ప్రతాప్, వీరారెడ్డి, జి.క్రిష్టారెడ్డి, వెంకటేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా నూతన చర్చి ప్రారంభం

ఖాజీపేట, జూన్ 10: మండల పరిధిలోని పత్తూరులో సోమవారం ఘనంగా చర్చిని ప్రారంభించారు. సోమవారం ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గ్రామంలో ఉన్న చర్చి పాతబడిపోవడంతో అందరు కలిసికట్టుగా చందాలు వేసుకుని దాదాపు రూ.కోటితో నూతన చర్చిని నిర్మించారు. చర్చి ప్రారంభం సందర్భంగా భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడంతోపాటు పాట కచ్చేరీ ఏర్పాటు చేశారు. అనంతరం టీడీపీ మండలాధ్యక్షుడు తిప్పిరెడ్డి లక్ష్మీరెడ్డిని గ్రామ సంఘం పెద్దలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం పెద్దలు వెంకటస్వామి, నాని, నాయకులు పుల్లయ్యనాయుడు, దేవకుమార్, విజయుడు, తదితరులు పాల్గొన్నారు.

పుట్టాను కలిసిన మండల మైనార్టీ నాయకులు



ఖాజీపేట, జూన్ 10: మైదుకూరు శాసనసభ్యుడిగా ఎన్నికైన సందర్భంగా ముస్లిం మైనార్టీ నాయకులు సిద్దారం కదీరుల్లా ఆధ్వర్యంలో పుట్టా సుధాకర్‌యాదవ్‌ను సోమవారం కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీకోసం మండల పరిధిలో ముస్లిం మైనార్టీ వారు వారి సహాయ సహకారాలు అందించారని, మండలాభివృద్ధికోసం పుట్టా సుధాకర్‌యాదవ్ ఎంతగానో కృషి చేస్తారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మైనార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి సిద్దారం కదిరుల్లా, కేకే బ్రదర్స్, ఇబ్రహీం, జాఫర్, అబ్దుల్లా, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌డీఏ కూటమి విజయం ఉద్యోగ ఉపాధ్యాయులదే

● ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం

కడప (ఎడ్యుకేషన్), జూన్ 10 :రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి విజయం ఉద్యోగ, ఉపాధ్యాయులు సాధించిన ఘన విజయమని ఎస్సీఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల శివార్జున తెలిపారు. సోమవారం కడప నగరం ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సాధారణ ఎన్నికల్లో టీడీపీ అఖండ విజయం సాధించిందన్నారు. చంద్రబాబునాయుడు ఉపాధ్యాయ బదిలీల్లో కౌన్సెలింగ్ విధానం ప్రవేశపెట్టి ఉపాధ్యాయ ఆత్మగౌరవం నిలబెట్టారన్నారు. ఆ విధానమే నేటికీ అమలువుతోందన్నారు. 12వ పీఆర్సీ పెండింగు డీఏలు 117 జీఓ రద్దు తదితర సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ వారసుడుగా రాజకీయ రంగంలోనూ అశేష ప్రజాదరణ పొందిన నందమూరి బాలక్రిష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

వరదకు మంత్రి పదవి కేటాయించాలి



మాట్లాడుతున్న మాదాసు మురళి

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 10: వరుసగా ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వరదరాజులరెడ్డికి మంత్రి పదవి కేటాయించాలని జనసేన నాయకుడు మాదాసు మురళి పేర్కొన్నారు. సోమవారం జనసేన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం, పాలకులు చేసిన తప్పుల వలన ప్రొద్దుటూరు నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదని పేర్కొన్నారు. అధికారంలో ఉన్న గత ప్రభుత్వ నాయకులు మున్సిపల్ నిధులను దుర్వినియోగం చేసి పట్టణాభివృద్ధిని అస్తవ్యస్తం చేశారని విమర్శించారు. ఈ నియోజకవర్గానికి ఇంతవరకు మంత్రి పదవి కేటాయించలేదని, ముక్కుసూటితనం, నిస్వార్థపరుడు అయిన వరదకు మంత్రి పదవి ఇస్తే నియోజకవర్గం అన్ని విధాలా అభివృద్ధి సాధిస్తుందని చంద్రబాబు ఆయనకు మంత్రి పదవి కేటాయించాలని విన్నవించారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు లక్ష్మీనారాయణ, మహమ్మద్‌గౌస్, భాస్కర్‌రెడ్డి, క్రిష్టారెడ్డి, టీడీపీ బీసీ నాయకుడు వెంకటకృష్ణయాదవ్, రవి, గోవిందు పాల్గొన్నారు.

బీసీల భవిష్యత్తు టీడీపీతోనే

వరదరాజులరెడ్డిని సన్మానించిన దేవాంగనేతలు



ప్రొద్దుటూరు జూన్ 10 : బీసీల భవిష్యత్తు టీడీపీ తోనే సాధ్యమని దేవాంగ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఉట్టినాగశయన పేర్కొన్నారు. సోమవారం టీడీపీ ఎమ్మెల్యేగా గెలుపొందిన నంద్యాల వరదరాజులరెడ్డిని దేవాంగసంఘం నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పుష్ప గుచ్ఛం అందజేసి శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో దేవాంగ సంఘం నేతలుగిద్దలూరు ఈశ్వరయ్య, ఉట్టి లక్ష్మీనారాయణ, కల్యాణ మండపం అధ్యక్షుడు రెడ్డిచంద్రశేకర సుబ్రమణ్యం, మచ్చా వెంకట సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

అమరావతి దీక్ష చేస్తున్నరైతులకు మద్దతు పలికిన ఆది



అమరావతిలో దీక్ష చేస్తున్న రైతులకు మద్దతు పలికిన ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

జమ్మలమడుగు, జూన్ 10: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి రైతులకు సోమవారం జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. వైసీపీ ప్రభుత్వం అమరావతి రైతులకు తీవ్ర ఇబ్బందులు కలిగించిందన్నారు. రాష్ట్రానికి జగన్‌మోహన్‌రెడ్డి రాజధాని లేకుండా చేసినందుకు ప్రజలు వైసీపీకి గుండు గీయించారన్నారు. అమరావతి రాజధాని రైతులు 1631 రోజులకు చేరుకున్న దీక్షకు మద్దతు పలికి భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి రాజధాని కోసం ఎంతో శ్రమించారని ఇక ఆ ప్రాంత రైతులకు ఎలాంటి భయం లేదని వారికి ఆదినారాయణరెడ్డి భరోసా కల్పించారు. అమరావతి మహిళా రైతులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పోషక విలువలు కల్గిన ఆహారం తీసుకోవాలి

కాశినాయన జూన్ 10: గర్భిణులు మంచి పోషక విలువలు కల్గిన ఆహారాన్ని తీసుకోవాలని మండల వైద్యాధికారిఎల్.జయరాములు పేర్కొన్నారు. సోమవారం నర్సాపురం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ కార్యక్రమం నిర్వహించారు. సీహెచ్‌వో నిర్మల,పబ్లిక్ హెల్త్‌నర్సు శారద,ఆరోగ్యపర్యవేక్షకులు బాలయ్య, హుస్సేనమ్మ, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బక్రీద్‌కు ఈద్గా మైదానంలో వసతులు కల్పించాలి

కమిషనర్‌కు వినతి పత్రం అందజేసిన అంజుమన్ సభ్యులు



ప్రొద్దుటూరు, జూన్ 10 : బక్రీద్ పండుగ రోజు పట్టణంలోని కొర్రపాడు రోడ్డులో ఉన్న ఈద్గా మైదానంలో ముస్లింల ప్రార్థనల కోసం మౌలికవసతులు కల్పించాలని అంజుమన్ కార్యదర్శి ఇలియాస్ డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రఘునాధరెడ్డిని కలిసి ఈద్గాలో షామియానాలు, మైకు, నీటి వసతి కల్పించాలని వినతిపత్రంలో కోరారు. ఇందుకు కమిషనర్ 17 తేదీ నాటికి పూర్తి స్థాయిలో వసతులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఖలీల్, షేర్ అలీ, మున్నా పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పుట్టాను కలిసిన పారిశ్రామిక వేత్తలు



మైదుకూరు, జూన్ 10 : మైదుకూరుకు చెందిన పలువురు పారిశ్రామిక వేత్తలు సోమవారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను ప్రొద్దుటూరులోని ఆయన నివాసంలో కలిశారు. పారిశ్రామికాభివృద్ధి చేపట్టాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని ఈ సందర్భంగా ఆయనను కోరారు. ఈ కార్యక్రమంలో రమణారెడ్డి, జగన్మోహన్, ప్రియదర్శినిరెడ్డి, గౌస్ బాష, సునీల్, సురేష్, కమల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలక్రిష్ణ పుట్టిన రోజు వేడుకలు



జమ్మలమడుగులో కేక్ కట్ చేస్తున్న సి.నారాయణరెడ్డి, సూర్యారాయల్

జమ్మలమడుగు, జూన్ 10: జమ్మలమడుగులో సోమవారం సినీ హీరో నందమూరి బాలక్రిష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ మస్టర్ పాయింట్ వద్ద పారిశుధ్య సిబ్బందితోపాటు నందమూరి ఫ్యాన్స్ జిల్లా కన్వీనర్ సూర్యారాయల్ తదితర అభిమానుల మధ్య నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా వారు చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం బాలకృష్ణ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నందమూరి ఫ్యాన్స్ సంజీవ, నాగేంద్ర, లక్షుమయ్య, బాలు, టీడీపీ నాయకులు ఖాదర్, శ్రీనివాసులరెడ్డి, చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు క్రైం..: ప్రముఖ సినీనటులు, హిందుపురం శాసనసభ్యుడు నందమూరి బాలక్రిష్ణ పుట్టినరోజు సందర్భంగా అభిమానులు వేడుకలు జరుపుకున్నారు. కేక్‌ను కట్ చేసి పంచుకున్నారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఎస్ఎం షరీఫ్, ఎస్ఎస్‌కే, మోక్షజ్ఞఫ్యాన్స్ ప్రెసిడెంట్ రాంప్రసాద్, రమేష్ బాబు, రాయలసీమ అధ్యక్షుడు ఎల్ సిద్దయ్య, ఫకృద్దీన్‌దాదా బ్రదర్స్ , గురు రెడ్డి, రమేష్. శశిధర్, శ్రీధర్ , చైతన్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.